క్లుప్తంగా

కొత్త లైట్లు వేశారు



ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో కొత్తగా వేసిన ఎల్‌ఈడీ లైట్లు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో కొంత కాలం నుంచి వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో ఆ ప్రాంతం అంధకారమయంగా ఉండేది. సమస్యపై పత్రికల్లో వరుస కథనాలు రావడంతో జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో బుధ, గురువారాల్లో విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు.దీంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



ప్రసన్న వినాయకుడిని దర్శించుకుంటున్న అతిథులు, కమిటీ సభ్యులు

కంచరపాలెం: జాషువానగర్‌లోని ప్రసన్న వినాయక ఆలయ 26వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు వరహర గిరిశర్మ, ముఖ్య అతిథి మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, రాజు సప్లయర్స్ అధినేత టి.ఎస్.ఎన్.రాజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. స్థానిక నాయకులు ఈతలపాక విజయలక్ష్మి, వెదుళ్ల పార్వతి, శీరపు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్వరరావు గణపతిని దర్శించుకున్నారు. జాషువా కళా ప్రాంగణం గౌరవ అధ్యక్షుడు గొటివాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి, కోశాధికారి గుమ్మిడి అచ్చిబాబు, జి.వి.రమణ, గుమ్మిడి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలి




స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్


ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. వేతనాల అంశంపై సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్లాంట్ కోసం పని చేస్తున్న ఉద్యోగులకు నేటికీ జీతాలు చెల్లించకపోవడం యాజమాన్యం అసమర్థతకు నిదర్శనమన్నారు. పని చేస్తున్న ఉద్యోగులకు ప్రతీ నెలా 1న జీతాలు చెల్లించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. పన్నులు, జీఎస్టీలు, కరెంటు బిల్లులు వంటివి సకాలంలో చెల్లిస్తూ... ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ పూర్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడిపితే లాభాల బాట పడుతుందన్నారు. ప్రభుత్వం సహకరించి అవసరమైన రా మెటీరియల్ సరఫరా చేయాలని, వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.శ్రీనివాస్, సన్యాసిరావు, శ్రీనివాసరాజు, వుల్లారావు, మరిడయ్య, సంతోష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బితుకు.. బితుకు

- భయంతో జీవిస్తున్న కొండవాలు ప్రాంత ప్రజలు
- కలగా మిగులుతున్న రక్షణ గోడల నిర్మాణం



రక్షణ గోడలు లేని త్రినాథపురం కొండవాలు ప్రాంతం



రక్షణ గోడలు లేని దుర్గానగర్ కొండవాలు ప్రాంతం

సింథియా: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాల ప్రజలు వర్షాకాలం వచ్చిన ప్రతిసారి భయం భయంగా కాలం వెల్లదీస్తున్నారు. పలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, మెట్ల మార్గాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న చోట కూడా శిథిలమై వర్షాలకు కూలుతుండడంతో వానొస్తే కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. వర్షాకాలంలో అధికారులు, నాయకులు ఆ ప్రాంతాల్లో పర్యటించి రక్షణ గోడలు నిర్మిస్తామని ఇస్తున్న హామీలు మాత్రం నెరవేరడం లేదు.

ఇదీ పరిస్థితి

పారిశ్రామిక ప్రాంతంలోదుర్గానగర్, ఎస్సార్‌కాలనీ, త్రినాథపురం, కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్‌లో కొండవాలు ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు వానొస్తే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చి ఇంటి మీద పడుతుండడంతో కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపించడం లేదు.

లక్షన్నర మంది జీవనం..జీవీఎంసీ 59, 60, 61, 62, 63 వార్డుల్లో దాదాపు లక్షన్నర మంది జీవిస్తున్నారు. వీరిలో అధికశాతం నిరుపేదలే ఉండడంతో అద్దె తక్కువ ఉంటుందని కొండవాలు ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. వర్షాకాలంలో వీరుపడే బాధలు వర్ణనాతీతం. మట్టి పెళ్లలు విరిగి ఇళ్లపై పడడం, ఇళ్లకు వెళ్లడానికి సరైన మెట్లు లేక జారి పడడం, విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉండడంతో కరెంటు షాకులు కొట్టడం, క్రిమికీటకాలు ఇళ్లలోకి ప్రవేశించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలకు జీవీఎంసీ ప్రత్యేక ప్రణాళికల అమలు చేయకపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారు.

గత అనుభవాలు భయానకం

గతంలో 59వ వార్డులో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు గణపతినగర్ కొండపై ఉన్న ఓ ఇంటిపై బండరాళ్లు దొర్లిపడడంతో మూడేళ్ల బాలుడు, గర్భిణీ మృతి చెందిన సంఘటన విశాఖ వాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆ సంఘటనను పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఇంకా మరువలేదు. ప్రస్తుతం వర్షాకాలంలోనైనా ప్రభుత్వం, అధికారులు కొండవాలు ప్రాంత ప్రజల గురించి ఆలోచించి ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కంటి మీద కునుకు ఉండదు



సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా వర్షాకాలంలో మాత్రం కంటి మీద కునుకు ఉండడం లేదు. విష సర్పాలు ఇళ్లలోకి చేరడం, వర్షపునీరు ఇంట్లో చేరుతుంది. బండరాళ్లు దొర్లుతాయామోనని భయంగా ఉంటుంది. ప్రభుత్వం చొరవ తీసుకుని రక్షణ గోడలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–సూరమ్మ, చింతల్లోవ

రక్షణ గోడలు నిర్మించాలి



వానొస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుంది. పగలంతా కష్టపడి పని చేసి ఇంటికి వచ్చినా రాత్రికి వర్షం వస్తే మాత్రం భయంగా ఉంటోంది. రక్షణగోడలు లేక బండరాళ్లు దొర్లుతున్నాయి. అధికారులు స్పందించి రక్షణ గోడల నిర్మాణం చేపట్టి మాకు రక్షణ కల్పించాలి.

– లక్ష్మి, ప్రకాష్‌నగర్

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తాం



శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాలలో నూతన కమిటీ పరిచయం



మల్కాపురం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్కాపురం: పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని నూతన కమిటీలు ప్రకటించాయి. పారిశ్రామిక ప్రాంతంలోని 'జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా అబ్దుల్ సలీం,వైస్ చైర్మన్‌గా సోదా పావని ఎంపికయ్యారు.వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ,సీనియర్ ఉపాధ్యాయుడు ప్రకాష్,విజయ్ కుమార్ అభినందించారు. మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.15 మంది ఎస్ఎంసీ కమిటీ సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా చింతల మాధురి,వైస్ చైర్మన్‌గా బానోతు రాణిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి,సీనియర్ ఉపాధ్యాయుడు కుమార్‌తో పాటు నాయకులు మజ్జి సోమేష్,చంద్రమౌళి తదితరులు వారికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

కేంద్రం విధానాలతో రాజ్యాంగానికి తూట్లు



నిరసన చేస్తున్న దళిత హక్కుల పోరాట కమిటీ నాయకులు

సింథియా: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగిస్తుందని, రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను నిర్వీర్యం చేసి చక్రవర్తి తరహాలో పాలన తీసుకురావాలని ఉబలాటపడుతున్నారని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మండిపడ్డారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి మల్కాపురం గ్రామమండలిలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు సెంగోల్‌గా పిలువబడుతున్న రాజదండాన్ని పార్లమెంట్‌లో ప్రతిష్టించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజదండం అంటేనే రాచరికానికి చిహ్నం అని, రాచరికం ఉన్న చోట ప్రజాస్వామ్యం ఉండదన్నారు. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ ఈ నెల 13వ తేదీన విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరుగతుందన్నారు. పోరాట కమిటీ నాయకులు, దళిత సోదరులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోదళిత హక్కుల పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



విశాఖ విద్య: శ్రావణ మాసంలో తొలి శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించడానికి అతివలు సిద్ధమయ్యారు. ఇళ్లను సుందరంగా ముస్తాబు చేశారు. పూజకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన వారితో మార్కెట్‌కు శ్రావణ శోభ వచ్చింది. ఎన్ఏడీ సెంటర్‌తో పాటు, మర్రిపాలెం రైతుబజార్‌లో పూజా సామగ్రి కొనుగోలు దారులతో సందడిగా కనిపించాయి. శ్రావణ శుక్రవారం శ్రీ మహాలక్ష్మి పూజ వేడుకగా నిర్వహించేందుకు ఆలయాల్లో సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



బాబాకు పూజలు చేస్తున్న అర్చకుడు



సాయి సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు పంచామృతాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. బాబాను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం పంచహారతులు ఇచ్చారు. భక్తులు సామూహికంగా సాయి సంకీర్తన ఆలపించారు. ప్రత్యేక హారతి ఇచ్చిన తర్వాత బాబా పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

ఉత్పత్తికి సరిపడా ముడిసరకు అందివ్వాలి



దీక్షా శిబిరంలో బెంగాల్ మాజీ సీఎం భట్టాచార్యకు నివాళులర్పిస్తున్న కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి విఘాతం కలగకుండా సరిపడా ముడిసరకు అందివ్వాలని ఉక్కు పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1274వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.54 వేల కోట్ల మేరకు పన్నుల రూపంలో చెల్లించిందన్నారు. మూడున్నర సంవత్సరాలుగా కార్మికులు తమ నిరసన వ్యక్తం చేస్తుంటే చీమకుట్టినట్టు కూడా కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడం దారుణమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించే వరకు ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో యు.రామస్వామి, ఉరివిటి మరిడయ్య పాల్గొన్నారు.

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రికి నివాళి

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటని సిటు నాయకులు ఎన్.రామారావు, శ్రీనివాసరాజు అన్నారు. దీక్షా శిబిరంలో ముందుగా భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భట్టాచార్య 11 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసి అక్కడి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. బెంగాల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపించిన ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కె.గంగాధర్, కె.వి.సత్యనారాయణ, బి.మహేష్, పెదిరెడ్ల నీలకంఠం, రామచంద్రమూర్తి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు



గోపాలపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ కమిటీ సభ్యులతో హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు



గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కమిటీ సభ్యులతో ఎచ్‌ఎం వేణుగోపాల్



హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్‌లో స్కూల్ కమిటీ సభ్యులతో హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు



పాఠశాల కమిటీ సభ్యులను సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

గోపాలపట్నం: స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మినహా మిగిలిన పాఠశాలల్లో విద్యార్థుల తల్లి దండ్రులను మాత్రమే లోపలికి అనుమతించారు. ప్రతీ తరగతిలో అభ్యర్థుల ఎన్నిక తర్వాత ప్రధాన కమిటీని ఎన్నుకున్నారు.. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో టీడీపీ నాయకులు ప్రధాన భూమిక వహించారు. హెచ్‌సీ వెంకటాపురం పాఠశాలలో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది.

అభినందన

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని హైస్కూల్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగాయి. ప్రతి క్లాసు నుంచి ముగ్గురు సభ్యుల చొప్పున ఎన్నుకున్నారు. వారిలో కమిటీ చైర్మన్‌గా గౌతమి, వైస్ చైర్మన్‌గా మడదాని సుశీలను సభ్యులు ఎన్నుకున్నారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కమిటీ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పర్యవేక్షణలో ఎన్నికలు

కంచరపాలెం: జీవీఎంసీ 54, 55, 56, 57 వార్డుల్లోని ఆర్పీ పేట, తిక్కవానిపాలెం, ధర్మానగర్, కంచరపాలెం, సుభాష్‌నగర్, కప్పరాడ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించారు. చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, కంచరపాలెం సీఐ భాస్కర్‌రావు, ఎస్ఐ రవికుమార్ ఎన్నికలను పర్యవేక్షించారు. ఎన్నికైన సభ్యులచే ప్రమాణ స్వీకారాలు చేయించారు.

జీవ వైవిధ్యం పరిరక్షణపై పోటీలు నిర్వహించాలి

అగనంపూడి: జిల్లా విద్యా శాఖ, ఏపీఎన్‌జీసీ అనకాపల్లి సంయుక్తంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జీవ వైవిధ్యం పరిరక్షణపై పాఠశాలల్లో పోటీలు నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ జిల్లా కో ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు సూచించారు. లంకెలపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలలు, ప్లస్ టూ పరిధిలోని 8 నుంచి 12వ తరగతుల్లోపు బాలలకు పోటీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వ్యాస రచన, వకృత్వ పోటీలు, మూడు నిమషాల నిడివిలో షార్ట్ ఫిల్మ్ త యారు చేసి ప్రదర్శించాల్సి ఉంటుందన్నా రు. మండల స్థాయిలో ముందుగా పోటీ లు నిర్వహించాలని, ఒక్కో విభాగం నుంచి ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో విద్యార్థి మాత్రమే పాల్గొనాల్సి వుంటుందని ఆయ న తెలిపారు. విజేతలకు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, క్లస్టర్ కో ఆర్డినేటర్ బుదుమూరు అన్నాజీరావు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



ఫ్లాట్‌లో దగ్ధమైన భాగం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. విశాలాక్షినగర్ గీతాంజలి సామాజిక భవనం ఎదురుగా సాయిశ్రీ రెసిడెన్సిలోని ఒక ఫ్లాట్‌లో శ్రీనివాసరావు దంపతులు నివసిస్తున్నారు. శ్రీనివాసరావు ఏయూలో ఉద్యోగి. ఆయన భార్య ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. వారిద్దరు గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లిన కొంత సేపటికి ఆ ఫ్లాట్ నుంచి పొగలు బయటకు వచ్చాయి. స్థానికులు గమనించి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని భావించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే ఫ్లాట్‌లోని బీరువాలు, మంచాలు, దుస్తులు తదితర సామగ్రి కాలిపోయి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు ఇంటి వద్దకు చేరుకొని సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా శ్రీనివాసరావు భార్య దేవుడి గదిలో పూజ చేసే సమయంలో దీపం వెలిగించి అనంతరం డ్యూటీకి వెళ్లడంతో దాని మంట ఎగిసిపడి సమీపంలో ఉన్న దేనినైనా అంటుకోవడం వల్ల ప్రమాదానికి కారణమై ఉంటుందని కొందరు భావిస్తున్నారు. తాము ఇంట్లో ఉన్న సమయంలోనే దీపం ఆరిపోయిందని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని శ్రీనివాసరావు తెలిపారు.

యోగా పోటీల్లో ఉక్కు ఉద్యోగి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రమణ

ఉక్కునగరం: జిల్లా యోగా పోటీల్లో స్టీల్‌ప్లాంట్ చార్జ్‌మెన్ ఎన్.వి.రమణకు ప్రథమ బహుమతి లభించింది. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా యోగా చాంపియన్‌షిప్ – 2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది పాల్గొనగా రమణ ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. గురుజీ ప్రభాకర్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎం.రవి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ వి.రామారావు చేతుల మీదుగా రమణ బహుమతి అందుకున్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. కంచరపాలెం పీఎస్ పరిధిలో పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సిబ్బందికి సీపీ సూచించారు. స్టేషన్ ఆవరణ, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

క్రైం సిబ్బంది విధులపై అసంతృప్తి

అనంతరం అదే పోలీస్ స్టేషన్‌లో మేడపైన ఉన్న కంచరపాలెం, ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్లను పోలీస్ కమిషనర్ సందర్శించారు. జీడీ ఎంట్రీ బుక్‌ను పరిశీలించిన ఆయన పుస్తకంలో ఎందుకు వారి వారి ఎంట్రీలను నిర్వహించడం లేదని, వారి కదలికలను ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో అక్కడ నుంచే క్రైం డీసీపీ వెంకటరత్నంతో ఫోన్‌లో సీపీ మాట్లాడారు. పలు విషయాలు అడిగి తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రైం అధికారులు, సిబ్బంది ఏ సమయానికి వస్తున్నారు, ఏ సమయానికి వెళ్తున్నారో కూడా నమోదు చేయకపోవడంతో వారిపై సీపీ అసహనం వ్యక్తం చేశారు. క్రైం విభాగంలో విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, పైఅధికారుల నుంచి సిబ్బందిని హెచ్చరించారు. సీఐ ఎస్.భాస్కరరావు, ఎస్ఐ రవికుమార్, క్రైం ఎస్ఐ ప్రకాషరావు, ఏఎస్ఐ సతీష్ ,సిబ్బంది ఉన్నారు.

మహిళా కళాశాలలో 'క్రియేటివ్ ఈ కంటెంట్'



ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం క్రియేటివ్ ఈ కంటెంట్ కార్యక్రమం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ పోలా భాస్కర్ నోడల్ రీసోర్స్ సెంటర్‌లోని రికార్డింగ్ స్టూడియోను ఉపయోగించుకుని నాణ్యమైన 'ఈ కంటెంట్'ను తయారు చేయాలని అధ్యాపకులకు సూచించారు. తద్వారా విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించేలా పాఠ్యాంశాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్‌గా డి.అరుణపద్మ, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ బి.హైమావతి, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు డి. ప్రజ్ఞతో పాటు ట్రైనింగ్ క్యాంప్‌లో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (చోడవరం, నక్కపల్లి, నర్సీపట్నం, చింతపల్లి)ల నుంచి పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు